సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దొడ్డి బాపూ ఆనంద్, తదితరులు

డాబాగార్డెన్స్: ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు పొందేందుకు పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ పెంచడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో ఎల్లమ్మగుడి వద్ద మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాండ్రేగుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సోగ్గాడు పుస్తకావిష్కరణ



శోభన్‌బాబు విగ్రహం వద్ద సోగ్గాడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అభిమానులు

అల్లిపురం: దివంగత నటుడు శోభన్‌బాబు నటించిన సోగ్గాడు చిత్రం 1975 డిసెంబర్ 19న విడుదలై తెలుగు చిత్ర సీమలో రికార్డ్ తిరగరాసిందని శోభన్‌బాబు కాంస్య విగ్రహ నిర్మాణ కమిటీ ఆర్గనైజర్ గువ్వల వెంకటరమణ తెలిపారు. మంగళవారం డాబాగార్డెన్స్ ప్రెస్‌క్లబ్ జంక్షన్‌లోని శోభన్‌బాబు విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో సోగ్గాడు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ముందుగా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాత రామానాయుడు చిత్రాలలో సోగ్గాడు ప్రత్యేకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కనకరాజు, కె.శోభన్‌బాబు, దన్నల ప్రసాద్, జి.నాగరాజు, బెహరా ప్రసన్న కుమార్, రమణ, ఎస్.రామారావు పాల్గొన్నారు.

27వ వార్డులో సంక్షేమ పథకాలపై ప్రచారం



సమస్యలు తెలుసుకుంటున్న వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని చుక్కా వారివీధి, సాయిబాబా ఆలయం, కుమ్మరి వీధిలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్‌ను దఫాదఫాలుగా పెంచుతూ జనవరి ఒకటి నుంచి రూ.3 వేలు చేస్తారని తెలిపారు. ప్రజల సంక్షేమమే సీఎం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పద్మనాభం అమ్మాజీ, రామాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పాలికల సోమినాయుడు, సచివాలయం కన్వీనర్లు అంగటికుమారి, ఎస్.మల్లేశ్వరి, చిట్టిబోయిన శివ శంకర్‌కుమార్, గృహసారథులు పి.త్రినాథ్, జె.గురుమూర్తిరెడ్డి, అప్పలరాజు, ఎస్.నర్సింగరావు, పి.రాజా, పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ చేశారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరువీధినిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈపూజలు నిర్వహించారు.

ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు ఏడో రోజు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
✆ 7997958342, 9912440606



గోకుల్‌పార్కులో విశాలమైన వాకర్స్ ట్రాక్

రూ.1.09 కోట్లతో గోకుల్ పార్క్ అభివృద్ధి



ఆహ్లాదం.. ఆనందం..

డాబాగార్డెన్స్: నగరవాసులకు పార్కులు ఆహ్లాదం, ఆరోగ్యం, ఉత్తేజాన్నిస్తున్నాయి. నిత్యం పని ఒత్తిడిలో ఉండేవారికి, ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు చదువుల్లో నిమగ్నమయ్యే వారికి పార్కులు కొంత రిలీఫ్ ఇస్తున్నాయి. అలాంటి పార్కుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారు. సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న జగన్‌మోహన్‌రెడ్డి పార్కుల సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, పనులు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా బీచ్‌రోడ్డులోని గోకుల్ పార్క్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. రూ.1.09 కోట్లతో అభివృద్ధి చేశారు.

గత ఏడాది నవంబర్ నెలలో రూ.30.50 లక్షలతో పార్కులో అభివృద్ధి పనులు చేపట్టగా, ఈ ఏడాది రూ.78.61 లక్షలతో మరింత సుందరీకరించారు. నగరవాసులు సేద తీరేందుకు పాలరాతి బళ్లలు ఏర్పాటు చేశారు. వాకర్ల కోసం వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేశారు. ముఖ్యంగా బీచ్ పర్యాటకులు, నగర వాసులను ఆకట్టుకునేలా రాధాకృష్ణుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. మురళీ గానంతో పార్కు ముందర ఏర్పాటు చేసిన నమూనా విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ పార్కు పరిసరాల్లో ఏటా కార్తీక పౌర్ణమి రోజున యాదవ కులస్థులు యదుమేళా నిర్వహిస్తుంటారు. పాలు, పెరుగు, వివిధ రకాల ద్రవ్యాలతో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఎంతో మంది వాకర్లకు ఈ పార్క్ అనువుగా ఉంది.



పార్కు ఎదుట మురళీగానం నమూనా

పార్క్ ఎంతో బాగుంది



బీచ్‌రోడ్డులోని గోకుల్‌పార్క్ ఎంతో చూడముచ్చటగా ఆధునికీకరించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన రాధాకృష్ణుల విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. సేద తీరేందుకు బళ్లలు ఏర్పాటు చేశారు. ఈ పార్కుకు వస్తే మానసిక ప్రశాంతత లభిస్తోంది.

– పసగాడ రామలింగేశ్వరరావు, దిబ్బలపాలెం

ప్రశాంతతకు చిరునామా..



ఏటా కార్తీక మాసంలో పౌర్ణమి రోజున నగర, జిల్లా వ్యాప్తంగా ఉన్న యాదవ కులస్థులు ఈ పార్కులో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు జరుపుకునేందుకు వీలుగా అభివృద్ధి చేశారు. ప్రశాంతతకు చిరునామాగా సుందరీకరించారు.

– చందక ప్రభాకర్, మహారాణిపేట

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎంఈవో పుష్యరాగం, తదితరులు



ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న ఉపాధ్యాయులు

అల్లిపురం: మహారాణిపేట మండలంలో గల హైస్కూల్స్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులతో డాబాగార్డెన్స్, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను ఎంఈవో – 1 బి.పైడినాయుడు, ఎంఈవో – 2 బి.పుష్యరాగం ప్రారంభించారు. క్వీన్‌మేరీ హైస్కూల్, ఎంవీడీఎం హైస్కూల్, రైల్వే హైస్కూల్, ప్రకాశరావుపేట హైస్కూల్స్ విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో బి.పైడినాయుడు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 23న పెదవాల్తేరులోని కేడీపీఎం హైస్కూల్‌లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రాజెక్టు ఎంపిక చేసి జిల్లా స్థాయి ప్రదర్శనకు పంపనున్నట్లు తెలిపారు. స్టూడెంట్ కేటగిరీలో ప్రథమ స్థానం ఎంఈడీ హైస్కూల్ దండుబజార్‌కు చెందిన ఆర్.నిఖిత, గ్రూప్ కేటగిరీలో ఎంజీఎం హైస్కూల్ విద్యార్థి ఎం.మహేష్, టీచర్ కేటగిరీలో గవర్నమెంట్ క్వీన్‌మేరీ స్కూల్ ఉపాధ్యాయులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీ నాగభూషణం పాల్గొన్నారు.

ప్రయాణికురాలి ముసుగులో చోరీలు

అల్లిపురం: బస్సులు, ఆటోల్లో ప్రయాణం చేస్తూ తోటి ప్రయాణికుల నుంచి విలువైన వస్తువులు, నగదు దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెయిందొరపేటకు చెందిన పిల్లా సుభద్ర ఈ నెల 14న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లే నిమిత్తం గాంధీబొమ్మ సెంటర్‌లో ఆటో ఎక్కింది. మార్గం మధ్యలో మరో మహిళ ఆటో ఎక్కింది. ప్రయాణం సమయంలో సుభద్ర చేపలు కొనేందుకు ప్లాస్టిక్ కవర్‌తో పట్టుకున్న రూ.16వేలు కవర్‌ను కట్‌చేసి దొంగిలించింది. బాధితురాలు ఆటో దిగిన తరువాత చూసుకుంటే బ్యాగు కత్తిరించి ఉండటంతో ఆమె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ క్రైం పోలీసులు నిందితురాలు విజయనగరం జిల్లా, కొత్తవలసకు చెందిన గంటా మీనాగా గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితురాలు గంటా మీనాపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉందని తెలిపారు. ఈమె అమాయక మహిళలే టార్గెట్‌గా బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తూ దొంగతనాలకు పాల్పడుతుందని పోలీసులు పేర్కొన్నారు.

బాలికా విద్యపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి

డాబాగార్డెన్స్: బాలికా విద్యపై విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు వచ్చే నెల 22వ తేదీ వరకు యాక్షన్ ప్లాన్ ఫర్ నేషనల్ జెండర్ క్యాంపైన్ నయాచేతన్ 2.0 ఎగైనెస్ట్ జెండర్ డిస్క్రిమినేషన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి తెలిపారు. అవగాహన ర్యాలీని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి ప్రారంభించారు. బాలికలకు అవకాశాలు కల్పించినప్పుడే సమాజ పురోభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ కేవీఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ బాలికలకు విద్యావకాశాలు మెండుగా కల్పిస్తే సమాజ సంక్షేమం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ బి.హైమావతి, తెలుగు అధ్యాపకురాలు బి.రాదమ్మ పాల్గొన్నారు.

మెడికల్ రిప్రజెంటేటివ్ సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ నాయకులు

సీతమ్మధార : జాతీయ ఫెడరేషన్ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం దేశ వ్యాప్త సమ్మె చేపట్టనున్నారు. ఇందులో భాగంగా సమ్మెకు సంబంధించి పోస్టర్‌ని మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు పి.వి.సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డి.స్రవంత్ మాట్లాడుతూ 1976లో ఏర్పడిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ మందుల పరికరాలపై జీఎస్టీ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో సహాయ కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు సంజయ్‌కుమార్, రాజేశ్వరరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం



జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదురుగా రోడ్డుపై నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సీతమ్మధార : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షురాలు వై.తులసి అన్నారు. అంగన్‌వాడీల సమ్మె ఎనిమిదో రోజుకు చేరిన సందర్భంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ద్వారకా బస్‌స్టాండ్, ఎల్ఐసీ, అంబేడ్కర్ జంక్షన్, మహిళా కళాశాల, రామ్‌నగర్ జంక్షన్ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీతో పాటు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పి.మణి, వెంకటలక్ష్మి, నాగేశ్వరి, నూకరత్నం, కృప, శ్యామల, నర్సయమ్మ, దేవి, కుమారి, ఇందిర, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆహ్వానం



ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును అభినందిస్తున్న శ్యామ్‌ప్రసాద్

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో శిక్షణ పొంది, ఉద్యోగాలు చేస్తున్న సుమారు 1000 మంది పూర్వ విద్యార్థుల సమావేశం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా 21న సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్యామ్ ప్రసాద్ మంగళవారం తారువ వెళ్లి క్యాంపు కార్యాలయంలో ఆహ్వానించారు. స్టేట్ మిషన్ మేనేజర్ ఎల్.ప్రసాద్ బాబు, జేడీఎం కళ్యాణి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



కల్లుపాకల వద్ద పథకాల బ్రోచర్ అందజేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జీవీఎంసీ 35వ వార్డులో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. వార్డులో 208 కల్లు పాకల వద్ద జెండా ఎగురవేసిన అనంతరం సచివాలయం వద్ద పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కోసం జగనన్నే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్ నీలకంఠం, వార్డు నాయకులు సచివాలయ సిబ్బంది, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

పేదల పాలిట వరం.. ఆరోగ్యశ్రీ

- పరిమితి రూ.25 లక్షలకు పెంపుపై మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి హర్షం
- లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ



స్మార్ట్‌కార్డులు అందిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



స్మార్ట్‌కార్డులతో లబ్ధిదారులు

డాబాగార్డెన్స్: పేదలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేందుకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత జీవం పోశారని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. జీవీఎంసీ 35వ వార్డు సైలాడ పైడితల్లినాయుడు కల్యాణ మండపంలో మంగళవారం స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలంతో కలిసి మేయర్ పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రస్తుతం ఉన్న పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచారని తెలిపారు. ఇప్పటికే ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధులకు జగనన్న ప్రభుత్వం ఎంత ఖర్చు అయినా వైద్యం అందిస్తుందన్నారు. రోగి పూర్తిగా కోలుకునే వరకు జీవనోపాధి కింద రోజుకి రూ.225 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని మేయర్ తెలిపారు. ఈ స్మార్ట్ కార్డు వల్ల రోగి ఆరోగ్యం వివరాలు గూగుల్లో నమోదవుతాయని, ఏ ఆస్పత్రికి వెళ్లినా రోగి పూర్తి వివరాలు తెలుస్తాయని ఆమె చెప్పారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటీ 48 లక్షల మందికి ఆరోగ్యశ్రీ కార్డులున్నాయని, కార్పొరేట్ వైద్యాన్ని రూ.25 లక్షల వరకు పెంచడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఖరీదైన వైద్యం చేయించుకోవాలంటే ఆస్తులు అమ్ముకునే వారన్నారు. నేడు జగనన్న సుపరిపాలనలో వైద్యానికి, విద్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతో ఆ పరిస్థితి నుంచి పేదలు బయట పడ్డారని చెప్పారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన ఆరోగ్యశ్రీ కార్డును.. ఆయన తనయుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత మెరుగు పరిచి పేదల పాలిట వరంగా మార్చారన్నారు. రాష్ట్రంలోని 2500 కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఖరీదైన వైద్యం అందుబాటులో తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఆలయ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి విశేష పూజలు



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో ఆరో రోజు మంగళవారం కనక మహాలక్ష్మి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. 108 స్వర్ణ పుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో 10 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2,300 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ, చిత్రంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ శేషమ్మ అన్నారు. మంగళవారం రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, ప్రైవేటు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్త్రీ, పురుష నిష్పత్తిలో చాలా తేడా ఉందన్నారు. లింగ నిర్ధారణ చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, చేసిన వారికి జైలు శిక్ష, జరిమానా విధిస్తామన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఫారం-ఎఫ్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశం ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో దిశ పోలీసు స్టేషన్ ఎస్ఐ డి.కాంతారావు, ఐసీడీఎస్ పీవో జి.శ్రీలత, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వ రంగ పరిశ్రమలతోనే దేశం అభివృద్ధి చెందిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న సంస్థను ప్రైవేటీకరించాలనుకోవడం కార్మికులకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1041వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు సంబంధిత సమస్యలను వదిలి తమ రాజకీయ అవసరాల కోసం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రజా ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలని.. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌తో ప్రజా సమస్యలు పరిష్కారం



లక్ష్మీటాకీస్ వద్ద వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మి టాకీస్ వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాసమస్యలపై వినతులు స్వీకరించారు. పాడైన రోడ్లు, కాలువలు బాగుచేయాలని కోరారు. ఉచిత ఇళ్ల స్థలాల మంజూరు కోసం ఎమ్మెల్యేకు పలువురు వినతి పత్రం అందజేశారు. అనంతరం పలువురు పెన్షన్, రేషన్ కార్డుల కోసం వాసుపల్లికి విన్నవించుకోగా.. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎంఎల్ చైర్మన్ కొల్లి సింహాచలం, సౌత్‌మైనార్టీ సెల్ ప్రెసిడెంట్, ముజీబ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ స్టేట్ నాయకులు సీనియర్ నాయకులు , గృహసారధులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అపోహలు వీడాలి

గోపాలపట్నం: ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అపోహలు వీడాలని జోన్ – 8 కమిషనర్ మల్లయ్య నాయుడు సూచించారు. ఓటు వేసే విధానం అందరూ తెలుసుకోవాలన్నారు. ఈవీఎంల పనితీరుపై కొత్తపాలెం గోపాలపట్నంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈవీఎంలపై ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయని, అందుకే ఎన్నికల కమిషన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని ఓటు వేసే విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఓటు ఎలా వేయాలి, తాము వేసిన ఓటు తాను అనుకున్న వ్యక్తికి పడిందా లేదా అని సరి చూసుకోవచ్చని గోపాలపట్నం ఆర్ఐ సురేష్ కుమార్ వివరించారు. వీవీ ప్యాడ్‌లో వేసిన ఓటు మరో యంత్రంలో కనిపిస్తుందని, ఇది 5 సెకండ్లు మాత్రమే ఉంటుందని చెప్పారు. నమూనా యంత్రాలతో ఇక్కడి వారికి ఓటు వేయించి, చూపించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేశారు.